క్లుప్తంగా

ఘనంగా ఐసీడీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఐసీడీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కసాపురం గ్రామంలో బుధవారం ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో ఐసీడీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ సెంటర్లో ఏర్పాటు చేసిన వేడుకలకు సూపర్‌వైజర్ పుష్పావతి హాజరయ్యారు. ఐసీడీఎస్ సిబ్బంది, గర్భిణులు, బాలింతలతో కలిసి ఆమె కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఐసీడీఎస్ ముఖ్య ఉద్దేశం, శాఖ చేపడుతున్న కార్యక్రమాలపై సూపర్‌వైజర్ అవగాహన కల్పించారు.

మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



గాంధీ విగ్రహం ఎదుట సత్యాగ్రహ దీక్ష చేపట్టిన యూటీఎఫ్ నాయకులు

గుంతకల్లుటౌన్: అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ స్కూల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని గాంధీ విగ్రహానికి యూటీఎఫ్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. బుధవారం యూటీఎఫ్ నాయకులు టీచర్ల సమస్యలను పరిష్కరించడంలో ఎన్‌డీఏ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా సత్యాగ్రహ దీక్షా కార్యక్రమాన్ని చేపట్టారు. యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు రామప్పచౌదరి, జిల్లా కోశాధికారి రాఘవ మాట్లాడుతూ మున్సిపల్ టీచర్ల పీఎఫ్ ఖాతాలను తెరవాలని, సస్పెన్స్ అకౌంట్‌లో ఉన్న మొత్తాన్ని జమ చేయాలని, ఎస్‌జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను ఉన్నతీకరించి పదోన్నతి కల్పించాలని కోరారు. టీచర్ల బదిలీలు జరపాలని, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'టెక్' విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల డైరెక్టర్ తదితరులు

తాడిపత్రి రూరల్: తాడిపత్రి ఇంజినీరింగ్ కళాశాల(టెక్)కు చెందిన 8 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు టాప్ అకాడమీ హెచ్ఆర్ నవీన్ తెలిపారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, డైరెక్టర్ నటరాజేశ్వరరెడ్డి, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ అధికారి లక్ష్మీకాంతరెడ్డి, జబీర్‌బాష తదితరులు ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

నేటి నుంచి శరన్నవరాత్రులు

గుంతకల్లు: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి, సత్యనారాయణపేట భవానీ దేవి, మస్తాన్‌పేట్ మారెమ్మదేవి ఆలయాలు గురువారం నుంచి జరిగే శరన్నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. ఆయా ఆలయాల్లో అమ్మవార్లు రోజుకో రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆలయాల్లో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పామిడి: స్థానిక కన్యకాపరమేశ్వరి, అంబాభవాని, ఒడ్డుగట్టు సుంకులమ్మ ఆలయాల్లో గురువారం (నేటి) నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించనున్నారు. ఆయా ఆలయాల్లో రోజూ అమ్మవార్లను ప్రత్యేక అలంకరించడంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అడిగిన వారందరికీ 'ఉపాధి' కల్పించండి



యల్లనూరు గ్రామసభలో మాట్లాడుతున్న ఏపీడీ వెంకటరత్నం

యల్లనూరు: అడిగిన వారందరికీ ఉపాధి హామీ కింద పనులు కల్పించాలని ఏపీడీ వెంకటరత్నం, ఏపీవో షబ్బీర్‌బాషా సిబ్బందికి సూచించారు. బుధవారం మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పనుల తయారీ ప్రణాళికలపై గ్రామసభలు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబం వలసలు వెళ్లకుండా పనులను గుర్తించాలన్నారు. కార్యక్రమాల్లో సర్పంచు పెద్ద ఓబులమ్మ, ఎంపీటీసీ తిమోతి, ఈసీ బబ్లూ, టీఏలు ప్రతాప్, శంకర్, జయరాం, అదిల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గాంధీజీ మార్గం అనుసరణీయం



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ భవాని, ఏసీ లావణ్య



గుత్తి మున్సిపల్ కార్యాలయంలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ వన్నూర్‌బీ

గుంతకల్లుటౌన్: సత్యాగ్రహమే ఆయుధంగా దేశానికి స్వాతంత్య్రాన్ని అందించిన జాతిపిత మహాత్మాగాంధీ మార్గం అనుసరణీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో గాంధీజీ 155వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గాంధీజీ చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ గాంధీజీ అహింసా మార్గం ద్వారా బ్రిటిష్ వారిని తరిమికొట్టిన ధీరుడని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ కెఎన్.లావణ్య, ఏసీపీ అబ్దుల్ సత్తార్, మెప్మా టీపీఆర్ఓ మోహన్, ఏఈలు హరికృష్ణ, సుదర్శన్, ఎల్ఎస్.మహబూబ్‌బాషా, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: మండల వ్యాప్తంగా బుధవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమాదేవి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీడీవో కార్యాలయంలోనున్న గాంధీజీ విగ్రహం వద్ద ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు.

పెద్దపప్పూరు: స్థానిక ఎమ్మార్సీలో బుధవారం గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంఈఓ శ్రీదేవి, సిబ్బంది పూలమాలలు వేసి నివాలులర్పించారు. కొట్టాలపల్లి ప్రాథమికపాఠశాలలో గాంధీజీ జయంతి నిర్వహించారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో బుధవారం గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సునీత, ఎంపీడీఓ తేజోత్స్న, మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి, ఈఓఆర్డీ దామోదరమ్మ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

యాడికి: గాంధీజీ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు అన్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా యాడికి పంచాయతీ కార్యాలయంలో ఆయన గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ గుప్త ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు, విశాలాక్ష్మి ఖాదీ సభ్యులు గాంధీ విగ్రహం వద్ద జయంతి నిర్వహించారు. రాయలచెరువు లయన్స్ క్లబ్ కార్యాలయం, వికాస్ స్కూల్‌లో గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘ నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో సర్పంచు అనురాధా, యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్ ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్, నాయకులు నాగేష్, ఈఓ ఎర్రిస్వామి పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టులు, సబ్ జైలు, రైల్వే డీజిల్‌షెడ్, ఫోర్టు రైల్వే స్టేషన్లలో బుధవారం గాంధీజీ 155వ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటంతో ర్యాలీలు చేపట్టారు.

పుట్లూరు: స్థానిక ఎమ్మార్సీలో బుధవారం గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంఈఓలు శ్రీదేవి, ప్రేమ్‌కుమార్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణను శుభ్రం చేశారు. అలాగే లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను నిర్వహించారు.

తాడిపత్రిటౌన్: స్థానిక పోలీస్‌స్టేషన్ సర్కిల్ లో ఉన్న గాంధీ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడకలు నిర్వహించారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కౌన్సిలర్ రఫీ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: గాంధీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ సర్కిల్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ గుజ్జల నాగిరెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ విభాగం నాయకులు శ్రీనివాసులు తదితరులు మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ భవన్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

పెద్దవడుగూరు: క్రిష్టిపాడు, పెద్దవడుగూరు తదితర గ్రామాల్లో మహాత్మగాంధీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఎంపీడీఓ కుళ్ళాయిస్వామి, ఎంఈఓ రాముడు, ఏపీఓ పుల్లారెడ్డి, సర్పంచ్ వరలక్ష్మీ, సీపీఐ నాయకులు, వెంకట్రాముడుయాదవ్ గాంధీజీ దేశ స్వాతంత్య్ర కోసం చేసిన పోరాటాలను గుర్తు చేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు.

పామిడి: ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు. ఆర్యవైశ్యసంఘం నాయకులు, కవి కే నారాయణమూర్తి, సభ్యులు లక్ష్మీనారాయణ, హరి, మహేష్ పాల్గొన్నారు.

గుత్తి రూరల్: పట్టణంలోని తహసీల్దార్, ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాలు, గ్రామ సచివాలయాల్లో బుధవారం మహాత్మా గాంధీ జయంతి నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ శివాజీరెడ్డి, తహసీల్దార్ ఓబిలేసు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మంజునాథ్, సీఎస్‌డీటీ సూర్యనారాయణ, ఆర్ఐ సందీప్ పాల్గొన్నారు.



క్రిష్టిపాడులో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు



పెద్దపప్పూరు ఎమ్మార్సీలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈఓ శ్రీదేవి, సిబ్బంది



గుంతకల్లు ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్యాలయ సిబ్బంది



యాడికిలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న బొంబాయి రమేష్‌నాయుడు



గుత్తిలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ తదితరులు



తాడిపత్రిలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రమేష్‌రెడ్డి

నూతన మద్యం పాలసీ రద్దు చేయాలి



గుత్తిలో గాంధీజీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న ఐద్వా, అంగన్‌వాడీ, సీఐటీయూ నేతలు



గాంధీజీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నూతన మద్యం పాలసీని రద్దు చేయాలని ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రంగమ్మ, జ్యోతి డిమాండ్ చేశారు. బుధవారం నూతన మద్యం పాలసీకి వ్యతిరేకంగా గాంధీచౌక్‌లో నిరసన తెలిపి అనంతరం గాంధీజీ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. మద్యం నియంత్రణ, నేరాలను అరికట్టడంలోనూ చంద్రబాబు సర్కారు ఘోరంగా వైఫల్యం చెందిందని వారు మండిపడ్డారు. సంపద సృష్టిలో భాగంగా మద్యం దుకాణాల సంఖ్యను పెంచడం సిగ్గుచేటని విమర్శించారు. మద్యం పాలసీతో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోవడమే కాకుండా మందుబాబుల ఇళ్లు ఆర్థికంగా చితికిపోనున్నాయన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం షాపులను నిర్వహించాలని, వారంలో ఒక రోజు డ్రై డేను అమలు చేయాలని, గుడి, బడి, బస్టాండ్, ఆస్పత్రి ప్రాంతాల్లో ఉన్న షాపులను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కార్యదర్శి రమేష్, డీవైఎఫ్ఐ కార్యదర్శి సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: మద్యం షాపులను ప్రభుత్వమే నిర్వహించాలని ఐద్వా నేతలు డిమాండ్ చేశారు. ఐద్వా, సీఐటీయూ, అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం మహిళలు, అంగన్వాడీ కార్యకర్తలు గాంధీజీ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఐద్వా మండల కార్యదర్శి రేణుక, జిల్లా నేత నిర్మల, సీఐటీయూ మల్లేష్ తదితరులు మాట్లాడుతూ మద్యం షాపులు ప్రైవేట్ వ్యక్తుల చేతులోకి వెళితే ఎక్కడ పడితే అక్కడ మద్యం విక్రయాలు జరుగుతాయన్నారు. దీంతో మహిళలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. ఈ రాష్ట్రంలో 70 శాతంపైగా నేరాలు మద్యం సేవించిన వారి వల్లే జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వమే మద్యం షాపులను నిర్వహించడంతో పాటు షాపులు తెరిచే సమయాన్ని కూడా కుదించాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని గాంధీజీ విగ్రహానికి అందజేశారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథచారి

గుత్తి: ఖైదీలందరూ సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ చారి సూచించారు. పట్టణంలోని స్పెషల్ సబ్ జైలును బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జైలులోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఖైదీలు గాంధీజీని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. జైలు సూపరింటెండెంట్ మహేశ్వరుడు, న్యాయవాదులు గంగాధర్ కుమార్, షఫీవుల్లా, కోర్టు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



గుత్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



కార్మికులను సన్మానిస్తున్న సర్పంచ్ పార్వతి, అధికారులు

గుత్తి: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం లభిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం స్వచ్ఛతా హీ సేవా ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణవీధుల్లో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాల ప్రతినిధులు ర్యాలీ చేపట్టారు. గాంధీ సర్కిల్ వద్ద వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఇదిలా ఉండగా ఫోర్టు రైల్వే స్టేషన్‌లో ఐఓడబ్ల్యూ నాగేశ్వర నాయక్, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మాకం శ్రీకాంత్, ఆటో యూనియన్ నాయకుడు నాగార్జున, బాషా తదితరులు మొక్కలు నాటారు. ఆర్టీసీ డిపో ఆవరణలో ఆర్టీసీ అధికారులు, కార్మికులు మొక్కలు నాటి నీరు పోశారు.

తాడిపత్రి అర్బన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉద్యోగులు, కార్మికులు బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం చేపట్టారు. డీఎం ఎల్.శంకర్ సిబ్బందితో కలిసి బస్టాండ్ ఆవరణలో మొక్కలు నాటారు. శివాలయం సమీపంలోని రమణమహర్షి ఆశ్రమంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆశ్రమ పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సేవలు మరువలేనివి

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్మికులు చేస్తున్న సేవలు మరువలేనివని బీకేఎస్ మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పెద్దమ్మ గుడి వద్ద ఉన్న సచివాలయంలో పంచాయతీ కార్మికులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పార్వతి మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు చిన్నపాటి జీతాలైనా అంకితభావంతో పని చేస్తున్నారన్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. అనంతరం కార్మికులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ తేజోత్స్న, ఈఓఆర్డీ దామోదరమ్మ, సెక్రటరీలు సాధిక్‌వలి, సువర్ణ, సచివాలయ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

గుంతకల్లు టౌన్: గాంధీ జయంతి సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఆర్టీసీ డీఎం.బాలాజీ దయాళ్, ఉద్యోగ, కార్మికులు శ్రమదానం చేశారు. చీపుర్లు పట్టుకుని చెత్తను ఊడ్చేశారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో మొక్కలు నాటారు. వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

చిన్నారికి ఆర్థిక సాయం



చిన్నారికి ఆర్థిక సాయం చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

తాడిపత్రి అర్బన్: క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం రోటరీ క్లబ్ సభ్యులు ఆర్థిక సాయాన్ని అందించారు. బుధవారం హనుమాన్ జంక్షన్‌లోని రోటరీ క్లబ్ కార్యాలయంలో యల్లనూరు మండలం చిలమలకూరు గ్రామానికి చెందిన ఆరేళ్ళ చిన్నారి ప్రగతికి రూ.17,500 నగదు అందజేశారు. సాయం చేయాల్సిన దాతలు ఎవరైనా సరే మానవతా దృక్పదంతో స్పందించి చిన్నారి తండ్రి గంగరాజు 9391776399 నంబర్‌కు ఫోన్ పే చేయాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు పివి.సుబ్రమణ్యం కోరారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ సభ్యులు పాల్గొన్నారు.

ఇద్దరి అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తాడిపత్రి రూరల్: మండలంలోని ఇగుడూరులో చోటు చేసుకున్న వరుస దొంగతనాలకు సంబంధించి బుధవారం ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు తెలిపారు. స్థానిక అప్‌గ్రేడ్ రూరల్ పోలీసు స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. ఇగుడూరుకు చెందిన దాసరి నరేంద్ర గొర్రెలను పోషణతో జీవనం సాగిస్తున్నాడు. వ్యసనాలకు అలవాటు పడిన ఆయన జల్సాలకు అవసరమైన డబ్బు కోసం చిన్నచిన్న దొంగతనాలు చేయడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన అన్నదమ్ములు సూర్యనారాయణ, ఆదినారాయణ తమ ఇళ్లకు తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లిన విషయాన్ని గమనించిన నరేంద్ర... ఇళ్లపైనున్న గవాచీ నుంచి లోపలకు ప్రవేశించి బంగారు, నగదు అపహరించుకెళ్లాడు. అనంతరం వాటిని వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురం మండలం యనమలచింతల గ్రామంలో నివాసముంటున్న తన మేనమామ భైరవుడి ఇంట్లో దాచి ఉంచాడు. చోరీ ఘటనలపై కేసు నమోదు చేసి, పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుల ఆచూకీ పసిగట్టి బుధవారం అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.2.50 లక్షల విలువైన 6.3 తులాల బంగారునగలు, రూ.95వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐ శివగంగాధరరెడ్డి, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

మట్కా బీటర్ల అరెస్టు

గుత్తి: పట్టణంలో బుధవారం రాత్రి పోలీసులు మట్కాబీటర్లు అరెస్ట్ చేశారు. సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్సీ కాలనీలో ఎస్ఐలు సురేష్, ఆశాబేగం సిబ్బంది విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మట్కా రాస్తున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.50,150 నగదు స్వాధీనం చేసుకున్నారు.

సంక్షిప్త సమాచారం

కర్ణాటక మద్యం పట్టివేత

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని రామకోటి కాలనీలో పోలీసులు బుధవారం కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నారు. కాలనీలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ గౌస్‌బాషా, ఏఎస్ఐ అమానుల్లా, సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీకి చెందిన చింతా కేశవనారాయణ(కూరగాయల కేశవ),చింతా నాగేశ్వర్ రావు (పొడుగు నాగేష్) ఇళ్ల వద్ద 20 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

యాడికి: మండల కేంద్రంలోని కుంటలో కర్ణాటక మద్యం అమ్ముతున్న చింతా రామచంద్ర అనేవ్యక్తిని బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 4 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

బుక్కరాయసముద్రం: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు.. బీకేఎస్ మండలం రెడ్డిపల్లికి చెందిన రాముడు (50), నాగమ్మ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన రాముడు... తన సంపాదన మొత్తం తాగుడుకే ఖర్చు పెడుతూ వచ్చేవాడు. దీనికి తోడు అప్పులు కూడా ఎక్కువయ్యాయి. విషయం తెలుసుకున్న భార్య నాగమ్మ పలుమార్లు భర్తను మందలించింది. తాగుడు మానేసి, కుటుంబపోషణపై మనసు పెట్టాలని కోరింది. అయినా రాముడు పెడచెవిన పెడుతూ వచ్చాడు. దీంతో విసుగు చెందిన నాగమ్మ భర్త నుంచి విడిపోయి అదే గ్రామంలోని మరో ఇంట్లో నివాసముంటోంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆదివారం ఇంట్లోకి వెళ్లి తిరిగి బయటకు రాలేదు. రెండు రోజుల తర్వాత ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో చుట్టుపక్కల వారు తలుపులు బద్ధలుగొట్టి చూశారు. లోపల ఫ్యాన్‌కు వేసుకున్న ఉరికి వేలాడుతున్న రాముడి మృతదేహాన్ని గుర్తించారు. రెండు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకోవడంతో మృతదేహం ఉబ్బిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నేటి నుంచి పప్పుశనగ రిజిస్ట్రేషన్

గుంతకలురూరల్/ యాడికి/ బుక్కరాయసముద్రం: రబీ సీజన్ కింద పప్పుశనగ పంపిణీకి కోసం గురువారం నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని గుంతకల్లు, యాడికి, బుక్కరాయసముద్రం ఏఓలు స్వాతి, మహబూబ్‌బాషా, శ్యాంసుందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. పప్పుశనగ కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలన్నారు.

లోకో రన్నింగ్ ఉద్యోగుల ధర్నా

గుంతకల్లు: స్థానిక రైల్వే జంక్షన్‌లోని క్రూ కంట్రోల్ ల్యాబ్ వద్ద లోకో రన్నింగ్ ఉద్యోగులు బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌సీఆర్ఎంయూ ఎల్ఆర్ఎస్ బ్రాంచ్ సెక్రటరీ ఎస్ఎం బాషా మాట్లాడుతూ గుంతకల్లు డిపో క్రూను గుత్తి, గుంతకల్లు ఎల్ఆర్ఎస్‌కు ఇవ్వడం వెంటనే ఆపాలన్నారు. గుంతకల్లులో పని చేస్తున్న ఎల్ఆర్ఎస్ ఉద్యోగులకు బైపాస్ వర్కింగ్ విధానాన్ని స్వస్తి పలికాలన్నారు. ఏకధాటిగా 72 గంటల పని విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.